క్లుప్తంగా

జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయాలి



జేవీకే స్టాక్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నెల్లిమర్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల పునః ప్రారంభం నాటికి జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలకు పంపిణీ చేయాలని ఎంపీడీఓ గిరిబాల సూచించారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో జేవీకే స్టాక్ పాయింట్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ఇప్పటికే జగనన్న విద్యా దీవెన సామగ్రిని మండలానికి పంపిణీ చేసిందన్నారు. ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కిట్ల రూపంలో పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



చెత్త నుంచి సంపద కేంద్రం పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

డెంకాడ: మండలంలోని బొడ్డవలస, జొన్నాడ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ స్వరూపారాణి సచివాలయ అధికారులను ఆదేశించారు. జొన్నాడ గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రం షెడ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బొడ్డవలస సచివాలయ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులను కూడా పరిశీలించారు.

8 నుంచి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మల్యాడ గ్రామంలో ఈ నెల 8 నుంచి శ్రీ కోదండ సీతా రామ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న ప్రతిష్ఠ సంకల్పం, నవగ్రహ సర్వతోభద్ర మండల ఆవాహనం, అంకురారోపణ తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 9న మండప పునః పూజలు, సూర్యనమస్కారాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఈ నెల 10న ప్రధాన ఘట్టమైన శిఖర విగ్రహ యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు మొయిదలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరామపురం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని ఎంపీడీఓ గిరిబాల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మొయిద గ్రామంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు ఇంటింటా పర్యటిస్తారని వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు. సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణతో ప్రకృతి వైపరీత్యాలకు చెక్



మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శుభ

విజయనగరం అర్బన్: పర్యావరణ పరిరక్షణతో వాతావరణంలోని వైపరీత్య మార్పులను అదుపులోకి తీసుకోవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శుభ అన్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ ఉపరితల ఉష్ణోగ్రతలకు పెరగడానికి గల కారణాలను వివరిస్తూ వాటిని తగ్గించడానికి మన వంతు బాధ్యతగా కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చని సూచించారు. భూగర్భ జలాలను కూడా పొదుపుగా వాడుతూ కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గౌరీశ్వరరావు, కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకులు పి.చంటిబాబు వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత

- కాలువలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- గడప గడపకు మన కార్యక్రమంలో స్థానికుల ఫిర్యాదుపై కోలగట్ల స్పందన



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, స్థానిక కార్పొరేటర్ తదితరులు

విజయనగరం: ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తామని, ఇందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయటం జరుగుతుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 27వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని సూర్య నగర్, జొన్నగుడ్డి తదితర ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమలు ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మహిళలు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా డిప్యూటీ స్పీకర్ స్థానిక సమస్యల పైన ఆరా తీయగా.. కాలువ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు వీధుల్లోకి వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో వెంటనే సంబంధిత అధికారులకు పిలిచి కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత మాట్లాడుతూ తమ డివిజన్ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి రాకతో స్థానిక సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని అన్నారు. అందుకు తగ్గట్లుగానే అవినీతి లంచగొండితనం లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల ఖాతాలకు చేరడంతో ప్రతిచోట హర్షం వ్యక్తం అవుతుందన్నారు. రుప్పా వీధిలోని శ్రీరామ ఆలయ అభివృద్ధి కోసం డిప్యూటీ స్పీకర్ లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి శాసనసభ్యులుగా చేసినట్లయితే మరింత అభివృద్ధికి చేరువవుతామన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మాజీ కౌన్సిలర్ సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలలో ఆనందం వ్యక్తం అవుతుందన్నారు. అదే పరిస్థితులలో స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుంటూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, డీఈ అప్పారావు, దుప్పాడ అప్పారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి పెద్దపీట



నూతన రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- 17వ డివిజన్‌లో రూ.18 లక్షలతో నిర్మించిన రోడ్డు ప్రారంభం

విజయనగరం: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నగర అభివృద్ధికి పెద్దపీట వేసే దిశగా ముందుకు వెళ్తున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 17వ డివిజన్ రాజీవ్ స్టేడియం నుండి క్యాటిల్ డిపో వరకు నూతనంగా ఏర్పాటు చేసిన రహదారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం ప్రారంభించారు. రూ.18 లక్షలతో నిర్మించిన రహదారిని ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు, కోఆప్షన్ సభ్యులు ఆశపు వేణు మాట్లాడుతూ నగరంలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి శరవేగంగా దూసుకుపోతుందన్నారు. రూ.18 లక్షలతో క్యాటిల్ డిపో ప్రాంతం వద్ద రహదారి నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. నగరంలోని ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుంటే, స్థానికంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అభివృద్ధిని చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. 2024లో జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆశపు సుజాత, కార్పొరేషన్ ఈఈ కే శ్రీనివాసరావు, కోరాడ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్‌పై నిరసన



వాటర్‌ప్లాంట్ ఎదుట నిరసనలో పాల్గొన్న ప్రజలు

విజయనగరం: అయ్యప్పనగర్‌లో ఏర్పాటు చేసిన అక్రమ వాటర్ ప్లాంట్‌ను రద్దు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం, అయ్యప్పనగర్ కాలనీ వాసులు వాటర్ ప్లాంట్ ముందు మంగళవారం నిరసనకు దిగారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకర రావు, అయ్యప్పనగర్ కాలనీ అసోసియేషన్ నాయకులు యుఎస్.రవికుమార్ మాట్లాడుతూ 2014 సంవత్సరం నుంచి ఇక్కడ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి నగర వాసులకు నీరు లేకుండా చేస్తున్నారన్నారు. పెద్ద మోటార్లు పెట్టి నీటిని తోడేయడం వలన భూగర్భ జలాలు ఇంకిపోతున్నయన్నారు. అక్రమంగా నడుపుతున్న వాటర్ ప్లాంట్‌లు రద్దు చేయాలని, నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మున్సిపల్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్, కలెక్టర్‌కి చెప్పడం జరిగిందన్నారు. దీంతో మున్సిపల్ అధికారులు అక్రమమని తాళం వేసి సీజ్ చేయడం జరిగిందన్నారు. ధర్నా వద్దకు వచ్చిన రెండవ పట్టణ సీఐ లక్ష్మణరావు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు సీజ్ చేయడం జరిగింది, మరలా ఓపెన్ చేస్తే ప్లాంట్ యజమానులపై క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు. అనంతరం ధర్నాను విరమించారు. అంతకు ముందు ధర్నాకు వచ్చిన వారితో ప్లాంట్ యాజమాన్యానికి చెందిన వారు వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిని అడ్డుకుని హెచ్చరించారు. ధర్నాలో ప్రజా సంఘాల నాయకులు టివి. రమణ, పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్, బి.రమణ, సుధీర్ కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో పలువురు ఉద్యోగులకు బదిలీ

నెల్లిమర్ల: నగర పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న ఐదుగురు ఉద్యోగులకు తాజాగా బదిలీ అయ్యింది. డిప్యుటేషన్‌పై విచ్చేసి, ఆర్ఐగా పని చేస్తున్న కోరాడ త్రినాథ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, మరో సీనియర్ అసిస్టెంట్ సురేష్ డిప్యుటేషన్ రద్దయ్యింది. త్రినాథ్ ఎలమంచిలి, సురేష్ పార్వతీపురం, శ్రీనివాసరావు బొబ్బిలి మున్సిపాలిటీలకు తిరిగి వెళ్లిపోయారు. తాజాగా బదిలీపై విచ్చేసిన హెల్త్ అసిస్టెంట్ కేవీవీ సత్యనారాయణకు బొబ్బిలి మున్సిపాలిటీకి, టీపీబీఓ జనార్ధనరావుకు పార్వతీపురం బదిలీ అయ్యింది. ఈ ఐదుగురిని రిలీవ్ చేసినట్లు కమిషనర్ పి.బాలాజీప్రసాద్ తెలిపారు. ఇదిలా ఉంటే ఇటీవల నగర పంచాయతీని సందర్శించిన మున్సిపల్ ఆర్‌డీ ఇక్కడ అధిక సంఖ్యలో సీనియర్ అసిస్టెంట్లు ఉన్నారని గుర్తించినట్లు సమాచారం. ఆయన ఆదేశాల మేరకే వేర్వేరు విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు సీనియర్ అసిస్టెంట్ల డిప్యుటేషన్లు రద్దు చేసినట్లు తెలిసింది.

రైల్వే ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ఒడిశాలో జరిగిన రైల్వే ప్రమాదంలో వందల సంఖ్యలో మరణించడానికి కారణం రైల్వే వ్యవస్థను ప్రవేటీకరణ చేయడమేనని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైల్వే మృతులకు మంగళవారం శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వేదిక నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, ఎం.శ్రీనివాస, పి.రమణమ్మ, బి.సుధారాణి, ఎ.జగన్‌మోహన్ రావు, ఆర్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

11న మోడల్‌స్కూల్ ప్రవేశపరీక్ష

మెరకముడిదాం: గర్భాం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 11న అదే స్కూల్ కేంద్రంగా పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డి.వి.ఎస్.అరుణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది వరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఏపీఎంఎస్.ఏపీసీ ఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటలకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులంతా సమయానికి పరీక్ష కేంద్రంలో హాజరు కావాలని సూచించారు.

రీసర్వే పనుల పరిశీలన



రీసర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి గ్రామంలో సమగ్ర భూరీసర్వే పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ మంగళవారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ధర్మవరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలో సర్వే పనులపై సిబ్బందిని ఆరా తీశారు. అలాగే వేములాపల్లి గ్రామంలో పౌరసరఫరాల గోడౌన్‌కు సంబంధించి సర్వే నంబర్ 78/5లో 2.50 ఎకరాల భూమిని పరిశీలించారు. భూమికి సంబంధించి తహసీల్దార్‌ను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.

కవితాంజలి పుస్తకావిష్కరణ



కవితాంజలి పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

విజయనగరం: సమాజ హితం కోరేదే సాహిత్యం అని వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి సహకారంతో వర్ధమాన రచయిత యడ్ల శ్రీనివాసరావు రాసిన కవితాంజలి పుస్తకాన్ని ఆయన తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయితలు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని, మంచి విషయ వస్తువుతో రచనలు గావించి మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు గురుప్రసాద్ మాట్లాడుతూ భాషతోనే మానవజాతి మనుగడ సాధ్యమని, భాషను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో రచయిత యడ్ల శ్రీనివాస్, సాయికృష్ణా వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ పతివాడ నారాయణరావు, రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత కె.ప్రసాద్, కె ఈశ్వర్ ప్రసాద్, యడ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ రోగులు మందులు వాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సూర్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలని జిల్లా ఎయిడ్స్ క్షయ, కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ ఎస్.సూర్యనారాయణ సూచించారు. స్థానిక యూత్ హాస్టల్‌లో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీటీసీ సెంటర్లకు వచ్చే వారికి హెచ్ఐవీపై అవగాహన కల్పించి పరీక్ష చేయాలని తెలిపారు. హెచ్ఐవీ సోకితే ఆందోళన చెందొద్దని, ఏఆర్‌టీ మందులు వాడుతూ మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చునన్న విషయాన్ని తెలియజేయాలని తెలిపారు. మందులు మధ్యలో మానివేసిన వారి ఇళ్లకు వెళ్లి మందులు తిరిగి వాడేలా చూడాలని తెలిపారు. క్షయ రోగుల అందరికీ హెచ్ఐవీ పరీక్షలు చేయాలన్నారు. హెచ్ఐవీ సోకిన భాగస్వామ్యులకు హెచ్ఐవీ పరీక్షలు చేయాలని చెప్పారు. సమావేశంలో డీపీఎం బాలాజీ, సాక్షి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నివాసయోగ్యానికి అనుకూలంగా సదుపాయాల కల్పన



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ కమిటీ సభ్యులు ఎస్‌వీవీ రాజేష్

- టిడ్కో అధికారులకు కార్పొరేషన్ హౌసింగ్ కమిటీ సూచన

విజయనగరం: నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండే విధంగా గృహ సముదాయాల వద్ద త్వరితగతిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని టిడ్కో అధికారులకు హౌసింగ్ కమిటీ సూచించింది. కార్పొరేషన్ కార్యాలయంలో టిడ్కో కార్పొరేషన్ అధికారులతో హౌసింగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించింది. హౌసింగ్ కమిటీ సభ్యులు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ నగరంలో సారిపల్లి, సోనియానగర్ ప్రాంతాలలో టిడ్కో ఇళ్ల నిర్మాణాల వద్ద ఎదురవుతున్న క్షేత్ర స్థాయి ఇబ్బందులను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఆయా సముదాయాల వద్ద ప్రస్తుతం నెలకొన్న సమస్యల పైన వివరిస్తూ వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సారిపల్లిలో తాగునీటికి నెలకొన్న ఇబ్బందులపై రాజేష్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు నీటి పంపిణీకి అడ్డంకులు లేవని అన్ని సరి చేస్తామని చెప్పారు. నిత్యవసర సరుకులను అందుబాటులోకి తెచ్చేందుకు అవకాశం ఇవ్వాలని సూచించారు. సోనియానగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని తెలిపారు. సమావేశాన్ని ఉద్దేశించి కార్పొరేటర్ తవిటిరాజు, మారోజు శ్రీనివాసరావు మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో సోనియానగర్, సారిపల్లి వద్ద అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారన్నారు. టిడ్కో ఈఈ ఎస్.జ్యోతి మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే అందరికీ ఇళ్లు అందజేసే విధంగా చూస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, హౌసింగ్ కమిటీ సభ్యులు గాదం మురళి, టిడ్కో ఏఈలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సీతంలో 'వరల్డ్ పెస్ట్ అవేర్‌నెస్ డే'



సీఎంఓ ప్రకాశరావును సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: 'వరల్డ్ పెస్ట్ అవేర్‌నెస్ డే' పురస్కరించుకొని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయిన విశాఖకు చెందిన పెస్ట్ క్యూర్ సొల్యూషన్స్, డీకేఎస్ ప్యాలెట్స్ అండ్ ఫర్నీచర్ ప్రైవేటు సంస్థల సీఎంఓ ప్రకాశరావు మాట్లాడుతూ చెద నియంత్రణ మానవ జీవనానికి కీలకమని అన్నారు. మానవులకు కీటకాల వల్ల కలిగే వివిధ సమస్యలు, ఆందోళనలను గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్యఅతిథిని యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.రవికిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో జీవ వైవిధ్యం



నవధాన్యాల సాగుపై మెగా క్యాంపు నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ బృందం

- రీజనల్ టెక్నికల్ లీడ్ అధికారి ప్రకాశ్

పూసపాటిరేగ: నవధాన్యాల సాగుతో జీవ వైవిధ్యం పెరుగుతోందని రీజనల్ టెక్నికల్ లీడ్ అధికారి కె.ప్రకాశ్ అన్నారు. మండలంలోని గోవిందపురం సచివాలయంలో మెగా నవధాన్యాల సాగుపై మంగళవారం క్యాంపెన్ జరిగింది.పలువురు రైతులకు నవధాన్యాలకిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 15 వేల హెక్టార్లలో 30 వేల మంది రైతులతో నవధాన్యాల సాగు లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పూసపాటిరేగ మండలంలో 1300 ఎకరాలలో 2390 మంది రైతులు నవధాన్యాల సాగుకు ఉపక్రమిస్తున్నారు అన్నారు. నవధాన్యాలు సాగుతో వివిధ సూక్ష్మ జీవులకు ఆశ్రయం ఇవ్వడంతో తద్వారా సాగు భూమిలో ప్రధాన పంటకు కావాల్సిన స్థూల, సూక్ష్మపోషకాలు లభిస్తాయన్నారు. బహుళ పంటల వలన కలుపు వుండదన్నారు. ప్రధాన పంటకు వాతావరణం వైపరీత్యాలకు తట్టుకొనే సామర్థ్యం పెరుగుతోంది అన్నారు. దిగుబడులు పెరగడంతో పాటు రైతులకు వ్యవసాయసాగు లాభదాయకంగా వుంటుందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాలు ప్రకృతి వ్యవసాయం రీజనల్ టీం మేనేజర్ జి.హేమసుందర్, మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ ఆర్.ఈశ్వరమ్మ, ప్రజాప్రతినిధులు బాలా అప్పలరాజు, దంగుడుబియ్యపు ఈశ్వర్రావు, జనపాల అప్పారావు, రామకృష్ణ , సీఆర్‌పీలు, ఐసీఆర్‌పీలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

గడప గడపలో 'నవరత్నాల' వెలుగులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు

నెల్లిమర్ల రూరల్: గడప గడపలో నవరత్నాల వెలుగులు కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మండలంలోని పూతికపేట గ్రామంలో సర్పంచ్ లెంక మంగమ్మ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ముందుగా పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేస్తున్న మంచిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా చిరు నవ్వులతో తమని ఆహ్వానిస్తున్నారని.. ముఖ్యమంత్రి జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్‌పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మెన్ చనమల్లు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్ బాబు, సర్పంచ్ లెంక మంగమ్మ, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం నాయుడు, పతివాడ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మెన్ సముద్రపు రామారావు, ఎంపీడీఓ గిరిబాల, డిప్యూటీ తహసీల్దార్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు సంతాపం



రైలు ప్రమాద మృతులకు సంతాపం తెలుపుతున్న సభ్యులు

విజయనగరం: ఒడిశాలోని బాలాసోర్ రైలు ప్రమాదం దేశ చరిత్రలో అత్యంత విషాదకరమైన దుర్ఘటన అని మానవ హక్కుల సంరక్షణ సంస్థ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెంటపాటి రుక్మిణి పేర్కొన్నారు. పట్టణంలోని మూడు కోవెల సమీపంలో మానవ హక్కుల సంరక్షణ సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాలాసోర్ ప్రమాదంలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. సంస్థ నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.కిషోర్, కార్యదర్శి కె.వి.రమణమూర్తి, నేషనల్ మీడియా సెక్రటరీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

